క్లుప్తంగా

ఫుట్‌బాల్ క్రీడాకారులకు సీఈ అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న సీఈ

పాల్వంచ: ఇటీవల కేటీపీఎస్ 7వ దశ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో 5, 6 దశల కర్మాగారానికి చెందిన క్రీడాకారులు ప్రథమ స్థానం సాధించారు. వీరిని బుధవారం సీఈ కార్యాలయంలో సీఈ ఎం.ప్రభాకర్‌రావు అభినందించారు. క్రీడాకారులు మరింత రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఈ బి.మోక్షవీర్, వి.వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్ సెక్రటరీ వీరస్వామి, వైటీఎంకే రాజు, వెల్ఫేర్ ఆఫీసర్ బి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

ఇల్లెందు: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) కోర్టు క్యాలెండర్లను బుధవారం ఇల్లెందు కోర్టు వరండాలో న్యాయవాదులు ఆవిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి సత్యప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 2024 సంవత్సరం క్యాలెండర్లను న్యాయవాదులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దంతాల ఆనంద్, ఎస్.వెంకటనర్సయ్య, కరుణాకర్, మహేష్, బాలకృష్ణ, ఐలయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న తహసీల్దార్

టేకులపల్లి: నవంబర్ 2020 నాటికి డిగ్రీ పూర్తి చేసిన యువతీ, యువకులు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటుకు నమోదు చేసుకోవాలని టేకులపల్లి తహసీల్దార్ కొండపల్లి కృష్ణవేణి తెలిపారు. ఈ మేరకు బుధవారం తహసీల్‌లో విలేకరులతో మాట్లాడారు. అర్హత కలిగిన వారు ఫిబ్రవరి 6వ తేదీలోపు ఆన్‌లైన్ కానీ ఆఫ్‌లైన్‌లో కానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు డిగ్రీ మెమో, ఓటరు ఐడీ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్‌లు, పాస్ ఫొటో జత చేయాలని తెలిపారు. గెజిటెడ్ సంతకాలు చెల్లవని, డిజిగ్నేషన్ ఆఫీసర్ సంతకం మాత్రమే చెల్లుతుందని, తహసీల్‌లో డిప్యూటీ తహసీల్దార్ డిజిగ్నేషన్ అధికారి హోదాలో ఉన్నారని ఓటుకు నమోదు చేసుకునే వారు అన్ని పత్రాలు, డిగ్రీ మెమో ఒరిజినల్‌తో పాటు తహసీల్‌కు వచ్చి డీటీని కలిసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటు లేని వారే కాకుండా గతంలో ఓటు ఉన్నవారు కూడా తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

చర్చి ప్రారంభం



చర్చిని ప్రారంభిస్తున్న కిరణ్‌కుమార్, వెంకటరెడ్డి

జూలూరుపాడు: మండలంలోని సాయిరాంతండా గ్రామంలో బుధవారం నూతనంగా నిర్మించిన వే ఆఫ్ హోప్ మినిస్ట్రీస్ ప్రార్థనా మందిరాన్ని ప్రారంభించారు. బ్రదర్ వి.మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మింపబడిన చర్చిని కల్లూరు విజన్ బైబిల్ కాలేజి ప్రిన్సిపాల్ ఎం.కిరణ్‌కుమార్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు, జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం చర్చిలో బ్రదర్ మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి డైరెక్టర్ పాస్టర్ వి.ఎలీషా, దుద్దుకూరి మధుసూధన్‌రావు, ధరావత్ రోజా, మాలోత్ మంగీలాల్ నాయక్, ధరావత్ రాంబాబు, వేల్పుల నరసింహారావు, పోతురాజు నాగరాజు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

టేకులపల్లి: మొక్కంపాడు తండా యూత్ కమిటీ ఆధ్వర్యంలో మొక్కంపాడు తండాలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలలో విజేతలకు బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథులుగా రెడ్డి రౌతు రత్నరావు బ్రదర్స్, టీచర్ బానోత్ రవి, సర్పంచ్ బానోత్ విజయవాలునాయక్, ఉపసర్పంచ్ మాలోత్ రాందాస్ నాయక్, తౌషిక్, మారుతీ ట్రేడర్స్ అధినేతలు మాలోత్ నరేష్, బానోత్ సురేష్ గ్రామ పెద్దలు మోతీలాల్ నాయక్ హాజరయ్యారు.

24 గంటల వైద్య సేవలు ఎప్పుడో?

- ఉల్వనూరు ఆరోగ్యకేంద్రానికి ఆరునెలల క్రితమే హామీ
- కానీ అమలు ఊసే లేదు
- ఈ ప్రభుత్వమైనా సర్కారు దవాఖానను పట్టించుకునేనా?



ఉల్వనూరు గిరిజన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

పాల్వంచరూరల్: సర్కారు దవాఖానాలో 24 గంటలు ఆరోగ్యసేవలు అందిస్తామని గత ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆరునెలలు క్రితం హామీ ఇచ్చి ఉత్తర్వులు కూడా జారీ చేశారు. కానీ ఆచరణలో అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం ప్రభుత్వం మారింది. అధికారులూ వేరొకరు వచ్చారు. ఇప్పటికైనా ఆస్పత్రిలో 24గంటల వైద్యసేవలు అందించాలని ఏజెన్సీ ప్రజలు కోరుతున్నారు. మారుమూల గిరిజన ప్రాంతమైన ఉల్వనూరులోని గిరిజన ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రస్తుతం 8గంటలు మాత్రమే వైద్యసేవలు అందిస్తున్నారు. అప్పటి రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు 24 గంటలూ వైద్యసేవలు అందించాలని జూన్‌లో ఆదేశాలు జారీ చేశారు. 2023 జూలై1 నుంచి అమలవుతుందన్నారు. కానీ దానిని పట్టించుకున్న నాథుడే లేడు. ఇక్కడ నిత్యం 50 - 60 మంది ఓపీ ఉంటుంది. ఆస్పత్రి పరిధిలో ఐదు హెల్త్ సబ్‌సెంటర్లు, 38 హ్యాబిటేషన్లు ఉన్నాయి. ఇక్కడ ఇద్దరు స్టాఫ్ నర్స్‌లకు ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. రెగ్యూలర్ ల్యాబ్ టెక్నీషియన్ లేడు. ఉన్న వైద్యసిబ్బంది కూడా స్థానికంగా ఉండకపోవడం అరకొర వైద్యసిబ్బందితో ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రైవేట్ వైద్యమే దిక్కు...

నిరుపేదల వైద్యానికి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలే దిక్కు అయినప్పటికీ అరకొర వైద్యసిబ్బంది 24గంటల వైద్యసేవలు అందించకపోవడంతో గిరిజన, గిరిజనేతర ప్రజలు, మండల కేంద్రమైన పాల్వంచలోని ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఏదైనా అత్యవసర చికిత్సల కోసం ఉల్వనూరు దాని చుట్టుపక్కల గ్రామాల నుంచి మండల కేంద్రమైన పాల్వంచలోని ఆస్పత్రులకు రావాలంటే పగలు ఆటోలు ఉంటాయి. కానీ రాత్రయితే ఆస్పత్రులకు రావాలంటే నానతంటాలు పడాల్సి వస్తోంది.

24 గంటలు అయితే పెరగనున్న వైద్యసిబ్బంది...

ఉల్వనూరులోని పీహెచ్‌సీలో ప్రస్తుతం ఒక డాక్టర్, ఒక స్టాఫ్‌నర్స్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 24గంటల వైద్యసేవలు అందించడానికి ఇద్దరు డాక్టర్లతోపాటు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, మరో ముగ్గురు స్వీపర్లను నియమించనున్నారు. ఆస్పత్రిని 8 గంటల నుంచి 24 గంటలు సేవలు అందించే విధంగా చేస్తానని ఉల్వనూరుకు వెళ్లిన సందర్భంగా అప్పటి రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డీఎంహెచ్‌కు జూన్‌లో ఉత్తర్వులు జారీ చేయడంతో స్థానిక ప్రజలు ఆనందపడ్డారు. కానీ కార్యరూపం దాల్చకపోవడంతో గిరిజన ప్రజలు నిరాశ చెందుతున్నారు.

ఉత్తర్వులు వచ్చినా అమలు లేదు..



ఉల్వనూరు గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండు నెలల నుంచి 24 గంటలు వైద్యసేవలు ఎప్పుడు అమలు చేస్తారోనని చూస్తున్నాం. ఏడాది క్రితమే ఆస్పత్రిని 24 గంటల వైద్యసేవలు అందించాలని అప్పటి హెల్త్ డైరెక్టర్ ద్వారా ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. కానీ నేటికీ అమలు చేయడం లేదు.

– మంగయ్య, ఉల్వనూరుకొత్తూరు

అధికారులు స్పందించాలి..



ఉల్వనూరు పీహెచ్‌సీ పరిధిలో 38 గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల గిరిజన ప్రజలకు రాత్రి సమయంలో ఏదైనా ఆపద వస్తే పాల్వంచకు వెళ్లాలంటే వాహనాల సౌకర్యం రోగుల ప్రాణాల మీదకు వస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారులు స్పందించి పీహెచ్‌సీలో 24 గంటలూ వైద్యసేవలు అందించాలి.

– రాంబాబు, లక్ష్మీదేవిపల్లి

అనుమతులు రావాల్సి ఉంది..



ఉల్వనూరులోని గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్యసేవలు అందిస్తామన్న మాట నిజమే. ఆస్పత్రిలో పోస్టుల భర్తీ కోసం ప్రతిపాదనలు పంపించాము. ప్రభుత్వం నుంచి, హెచ్‌ఆర్ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. రాగానే వెంటనే సిబ్బందిని నియమించి 24 గంటలూ వైద్యసేవలు అందిస్తాం.

– డాక్టర్ జేవీఎల్.శిరీష, డీఎంహెచ్ఓ

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి



తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న డ్రైవర్లు

టేకులపల్లి: మోటారు వర్కర్స్, డ్రైవర్లకు శాపంగా మారిన కేంద్ర ప్రభుత్వం తెచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో- మోటార్ వర్కర్స్ యూనిస్ రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి యాకూబ్‌షావలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు టేకులపల్లిలోని సేవాలాల్ గుడి వద్ద నుంచి ప్రదర్శనగా వచ్చి తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ మత్తయ్యకు వినతిపత్రం అందజేశారు. కేటీసీ నుంచి ఇల్లెందు కొత్తగూడెం డంపింగ్ టిప్పర్లు బీపీఎల్ తిరిగే టిప్పర్ల డ్రైవర్లు ఈరోజు విధులు బహిష్కరించి ఈ నిరసనల్లో పాల్గొనడం అందుకు ఓనర్లు సహకరించడం అభినందనీయం అన్నారు. మోటారు రంగంపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది డ్రైవర్లను ఇప్పటికే చేయని నేరాలకు దోషులుగా చేసి పోలీసులు, ఆర్టీఓ అధికారులు శిక్షలు వేస్తున్నారని వాపోయారు. కేంద్రప్రభుత్వం మోటారు వాహనాల చట్టం ప్రకారం ప్రమాదం జరిగిన డ్రైవరుకు, రక్షణ కల్పించకుండా నూతన చట్టాల పేరుతో, శిక్షలు విధించడం దుర్మార్గమన్నారు. అన్నిరకాల మోటారురంగ కార్మికులను ఐక్యం చేసి దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జర్పుల సుందర్, ధర్మపుర వీర బ్రహ్మాచారి, పంతులు, లకావత్ నరేష్, కుంజ వీరభద్రం, మదర్ కోటేష్, రఘు, చింటూ, రాజేష్, రవీందర్, రామకోటి, చంటి, జోగ కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ



టేకులపల్లి: అక్షింతలతో ఎమ్మెల్యే కనకయ్య



జూలూరుపాడు: శోభాయాత్ర నిర్వహిస్తున్న ధర్మజాగరణ సభ్యులు

టేకులపల్లి: అయోధ్య రాముని అక్షింతలకు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు బుధవారం కోయగూడెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా గడపగడపకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూనెం ఉమ, కోరం లక్ష్మి, పూనెం సురేందర్, పెరుగు సత్యనారాయణ, జాల మురళి, గంగారపు కోటేశ్వరరావు, శ్రీను, బోసు తదితరులు పాల్గొన్నారు. సులానగర్ గ్రామంలోనూ సర్పంచ్ అజ్మీర బుజ్జి ఆధ్వర్యంలో అక్షింతలు పంపిణీ చేశారు. బొడ్డు అశోక్, రమేష్, లక్‌పతి, వేణు, సతీష్, చరణ్, దీపక్, జగదీష్ సుధీర్, చంటి పాల్గొన్నారు.

జూలూరుపాడు: గాంధీనగర్ గ్రామంలో బుధవారం అయోధ్య రాముని సేవిత అంక్షితలతో ధర్మ జాగరణ కమిటీ సభ్యులు, రామభక్తులు శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి అంక్షితలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మజాగరణ కమిటీ సభ్యులు, రామభక్తులు ధరావత్ రాంబాబు, గుగులోత్ రవీందర్, మాలోత్ సురేష్, మాలోత్ భద్రు, భూక్యా రాందాస్, మాలోత్ నరసింహారావు, భూక్యా హనుమ, లకావత్ రవి, ధరావత్ లాలు నాయక్, బోడా మోహన్, భూక్యా శ్రీను, బానోత్ భద్రు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సింగరేణి(కొత్తగూడెం): డిసెంబర్ 27న సింగరేణిలో జరిగిన కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో లంచగొండితనం, అవినీతి ముందు నీతి, నిజాయితీ ఓడిపోయిందని హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. బుధవారం సింగరేణి ప్రధానాస్పత్రి వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణిలో కార్మికులకు ఏఐటీయూసీ మందు, బిర్యానీలు అందించిందని, కార్మికులకు వీటిని అలవాటు చేసి, ఆ తరువాత ప్రతీ పనికి ఒకరేటు వసూళ్లు ప్రారంభించి కార్మికులను తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. వారు ఏనాడూ స్వయంగా ఎన్నికల్లో గెలవలేదని, రెండుసార్లు ఐఎన్‌టీయూసీ, టీఎన్‌టీయూసీలతో గెలవగా, ఈసారి టీబీజీకేఎస్ సపోర్ట్‌తో గెలిచిందని, తాము స్వయంగా కార్మికుల సమస్యలపై యాజమాన్యాన్ని నిలదీస్తామన్నారు. సమస్యలపై ఆందోళన చేసి, పరిష్కారం అయ్యేంత వరకు వదిలిపెట్టమని పేర్కొన్నారు. సింగరేణిలో కార్మికుల సమస్యలు పేరుకపోయాయి వాటిని పరిష్కరించాలని లేకపోతే వదిలిపెట్టమన్నారు. కొత్త సీఎండీ బలరామ్‌కు, సంస్థకు కొత్తగనులు కేటాయింపు, ఇతర అంశాలలో తమ కార్మిక సంఘం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈనెల జరగనున్న సింగరేణి మెడికల్ బోర్డ్ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. గతంలో మాదిరిగా అవకతవకలు చేస్తే సహించేది లేదన్నారు. కార్పొరేట్ రిఫరల్ అంతా మాయ జరుగుతోందని, ట్రీట్‌మెంట్ సరిగా ఇవ్వటంలేదని విమర్శించారు. వీటిలో కొంతమంది ఆస్పత్రి అధికారులకు వాటాలున్నాయని, అందుకే వారికి ఇష్టం వచ్చిన ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. సీఎండీ ఈ విషయంలో చొరవ తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా ఉద్యోగులకు జీఎం జాన్‌ఆనంద్ ఆదేశాల మేరకు బీ టైప్ క్వార్టర్స్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు. బుధవారం జీఎం కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఫ్రెష్ ఎలాంట్‌మెంట్, చేంజ్ ఆఫ్ కార్టర్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అర్హులకు క్వార్టర్స్ కేటాయించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, జూనియర్ అసిస్టెంట్ వీరన్న పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి..

సింగరేణిలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జీఎం జాన్ ఆనంద్ అధికారులను కోరారు. బుధవారం జీఎం కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఈ నెల 26న పట్టణంలోని 24 ఏరియా సింగరేణి గ్రౌండ్‌లో గణతంత్ర వేడుకల నిర్వహిస్తున్నామని ఘనంగా ఏర్పాట్లు చేయాలని కోరారు. ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, ఏజీఎం గిరిధర్‌రావు, ఏరియా ఇంజనీర్ నరసింహరాజు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, ఏరియా సివిల్ అధికారి రవికుమార్, ఇతర అధికారులు ధనుంజయ్‌రెడ్డి, దీలీప్‌కుమార్, అంజిరెడ్డి, మధుబాబు, పవన్‌కుమార్, నాగేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.

రమేష్ కుటుంబానికి అండగా ఉంటాం..

ఇల్లెందు: స్టేట్ బ్యాంకు ఆఫ్ హైదరాబాద్ శాఖలో వివిధ బ్రాంచిలలో పనిచేసి ఎంతోమందికి బ్యాంకు సేవలు అందించిన ఇల్లెందులపాడుకు చెందిన బోషాల రమేష్ అనారోగ్యంతో మృతి చెందటం బాధాకరమని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఇల్లెందులపాడులోని రమేష్ స్వగృహంలో జరిగిన దశదిన కర్మలకు హాజరైన వారు రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కటకం పద్మావతి, గిన్నారపు రజిత, అంకెపాక నవీన్, మాజీ కౌన్సిలర్లు, వివిధ పార్టీల నేతలు డానియేల్, పులి సైదులు, మేకల శ్యామ్, నబీ, కిరణ్, పృథ్వీ, రాయల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో భద్రత కరువు



ప్రమాదానికి గురైన కళాశాల బస్సు

సుజాతనగర్: మండల కేంద్రం సుజాతనగర్ నుంచి వేపలగడ్డ మీదుగా సాగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భద్రత కరువైంది. సుజాతనగర్ నుంచి చుంచుపల్లి మండలం గోధుమవాగు వరకు చేపట్టిన నాలుగులేన్ల రహదారి విస్తరణ పనులకు ప్రభుత్వం రూ.45 కోట్లు నిధులు కేటాయించింది. గుంతలమయంగా ఉన్న బీటీ రోడ్డును మునపటి కంటే ఎత్తు పెంచి ఆపైన మరో బీటీ లేయర్ వేస్తున్నారు. ఈ క్రమంలో ఒకవైపు పనులు జరుగుతుండటంతో మరోవైపు అన్ని వాహనాల రాకపోకలకు అనుమతిస్తున్నారు. కానీ ఇందుకు అనుగుణంగా బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఐదు రోజుల క్రితం తెల్లవారుజామున ఓ కళాశాలకు చెందిన బస్సు కొత్తగూడెం వెళ్తున్న క్రమంలో ఖమ్మం నుంచి వస్తున్న యాష్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. సంక్రాంతి పండుగ దృష్ట్యా వాహనాల రద్దీ పెరిగిన సమయంలో కూడా ఎలాంటి భద్రతాపరమైన చర్యలు చేపట్టకపోవడం గర్హనీయం. ఉదయం పొగమంచు కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుండగా.. మరోవైపు పనులు జరుగుతుంటే కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

ఇల్లెందురూరల్: ప్రభుత్వ ఖాళీ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఆర్ఐ పద్మ హెచ్చరించారు. మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీ పరిధిలో సింగరేణి సరెండర్ భూమిని ఆక్రమించి ప్రహరీ నిర్మించేందుకు ఏర్పాట్లు చేసుకుంటుండగా తహసీల్దార్ ఆదేశంతో బుధవారం ఆ ప్రాంతాన్ని ఆర్ఐ పద్మ, బాలాజీనగర్ గ్రామపంచాయతీ కార్యదర్శి నీలిమ సందర్శించి అడ్డుకున్నారు. ఖాళీ స్థలాల్లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా కూల్చివేస్తామని ఆక్రమణదారులను హెచ్చరించారు.

నేడు వాహనాల వేలం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం రైటర్ బస్తీలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో వివిధ సారా కేసులలో పట్టుబడిన వాహనాలకు గురువారం వేలంపాట నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ జానయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేర్లు నమోదు చేసుకొని పాటలో పాల్గొనాలని, ఉదయం 11 గంటలకు వేలంపాట జరుగుతుందని, ఆధార్, పాన్‌కార్డులు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

రిటైర్డ్ కార్మికులకు తీపి కబురు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి రిటైర్డ్ కార్మికులకు యాజమాన్యం తీపికబురు తెలిపిందని, సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈనెల 19న 32శాతం లాభాల వాటా, ఈనెల 21న లాభాల బోనస్‌ను చెల్లిస్తుందని, దీంతోపాటు కార్మికులకు రావాల్సిన 11వ వేజ్ బోర్డ్ నుంచి 27 నెలల ఏరియర్స్ ఫిబ్రవరి 6న చెల్లించబడుతుందని వివరించారు.

కారుణ్య నియామకాలు చేపట్టండి

పాల్వంచ: జెన్‌కోలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలలో సత్వరమే కారుణ్య నియామకాలు చేపట్టాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ (1535) రీజినల్ కార్యదర్శి వి.ధనయ్య బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఉద్యోగులకు వ్యతిరేకంగా ఉన్న జీఓను రద్దు చేయాలని, ఈ ప్రక్రియను అన్ని శాఖల్లో అమలు చేయాలని కోరుతూ టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీకి ఫ్యాక్స్ ద్వారా వినతిపత్రం పంపినట్లు పేర్కొన్నారు.

సీపీఐ నాయకుడి మృతి

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు ఊడల వెంకటరామయ్య (92) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఆయన భౌతికాయాన్ని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్ర నరేంద్రకుమార్, మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మహిళ అదృశ్యం

ఇల్లెందు: పట్టణంలోని స్టేషన్ బస్తీకి చెందిన 34 ఏళ్ల గోరంట్ల ఆశా అనే మహిళ ఖమ్మంలో బ్యాంకు పని ఉందని చెప్పి మంగళవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ దొరకలేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారించిన సీఐ కరుణాకర్ కేసు నమోదు చేశారు.

జీఎం ఆఫీస్ ఎదుట ఆందోళన



జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గుడిసెవాసులు

ఇల్లెందు: పట్టణంలోని సీఎస్‌పీ బస్తీ రాజీవ్‌నగర్ తండా సమీపంలోని సున్నం రాజయ్య నగర్, దేవులపల్లి యాకయ్య నగర్‌లకు చెందిన గుడిసెవాసులు ఐదేళ్లుగా గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇక్కడి గుడిసెవాసులపై సింగరేణి సెక్యూరిటీ గార్డులు ఇళ్లల్లో పురుషులు లేని సమయంలో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారని సీపీఎం మండల కార్యదర్శి దేవులపల్లి యాకయ్య ఆరోపించారు. బుధవారం గుడిసెవాసులతో కలిసి సింగరేణి జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. ఒకవైపు అటవీశాఖ మరోవైపు రెవెన్యూశాఖ అధికారులు ఇబ్బందులు పెడుతుంటే మరోవైపు మున్సిపల్, సింగరేణి అధికారులు తమదే భూమి అంటూ పేదల మీద జులుం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు, గుడిసెవాసులు కిరణ్ మోహన్ రావు, హుస్సేన్, కౌసల్య, వీరభద్రం, కోటమ్మ, సుజాత, రాణి, సంతోషి, మల్లయ్య, రాజు, పాషా, విజయ పాల్గొన్నారు.

ప్రజాపాలన ఆన్‌లైన్ ఎంట్రీలను సరిచేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ బాలరాజు

ఇల్లెందురూరల్: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ నూరు శాతం పూర్తయింని, అందులో ఏమైనా తప్పులుంటే వెంటనే సరిచేయాలని ఎంపీడీఓ బాలరాజు సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో పలు అంశాలపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీల వారీగా ఆన్‌లైన్ చేసిన పత్రాలను కార్యదర్శులకు అందజేశామని, దరఖాస్తులు ఇచ్చిన వారి పేర్లు నమోదు కాకుంటే వెంటనే సరిచేయాలని సూచించారు. దరఖాస్తులలో రెండుసార్లు నమోదైన దరఖాస్తులు ఎన్ని? ఆధార్ నంబర్ లేని దరఖాస్తులు ఎన్ని? రేషన్‌కార్డు నంబర్ లేని దరఖాస్తులు ఎన్ని? ఫోన్ నెంబర్ లేని దరఖాస్తులు ఎన్ని వంటి అంశాలను గుర్తించి కార్యాలయంలో అందజేయాలని ఆదేశించారు. అంతేకాకుండా గ్రామపంచాయతీలలో నర్సరీ పనులు వేగవంతం చేయాలని చెప్పారు. బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తయినందున సీడ్ ఎంపిక పనులు చేపట్టాలన్నారు. ఉపాధి పనులకు కూలీల సంఖ్య పెరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఇటీవల నిర్వహించిన ఎన్ఆర్ఈజీఎస్ సామాజిక తనిఖీ మండల మహాసభలో వెలుగు చూసిన తప్పిదాలు భవిష్యత్‌లో జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ కార్యాలయ భవనాల నిర్మాణ పనులు వేగవంతం అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎంపీఓ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బస్టాండ్ కిటకిట.. అడ్రస్ లేని బస్సులు



ఇల్లెందు బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

ఇల్లెందు: సంక్రాంతి పండుగ ముగిసింది. పండుగకు ఊర్లకు వచ్చిన ప్రజలు తిరుగు పయనమయ్యారు. బంధువులు, దూరప్రాంతాల నుంచి వచ్చివెళ్లే వారితో బస్టాండ్ కిటకిటలాడుతోంది. మంగళవారం కనుమ కావడంతో బుధవారం నుంచి తమ గమ్యస్థానాలకు బయలుదేరారు. దీంతో ఇల్లెందు బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ బాగా పెరిగింది. మహిళలకు ఉచిత బస్ అమలుతో ప్రయాణంతో నరకం చూస్తున్నామని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. బస్టాండ్‌లో ఉదయం నుంచి ప్రయాణికుల జాతర కనిపించింది. రద్దీకి తగ్గట్లు అధికారులు బస్సు సర్వీసులు కల్పించలేదు. దీంతో ప్రయాణికులు ఆటోలు, టాటా మ్యాజిక్‌లలో ప్రయాణించారు. ఇదిలా ఉంటే బస్టాండ్‌లోనే బస్‌లు నిండిపోతున్నాయి. పట్టణంలోని పలు స్టాప్‌లలో బస్‌లు నిలపకుండా వెళ్లిపోతుండడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.